

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. యర్రగుంటపల్లిలో మంగళవారం గడప-గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగుంటపల్లి సెంటర్లో ఆటో యూనియన్ నాయకులు యర్రగుంటపల్లి - సీతానగరం రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంఎల్ఎని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలో పనులు పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగుంటపల్లి సర్పంచి తుల్లిమిల్లి రాణి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజాసుధాకర్, మిర్యాల దిలీప్, యండపల్లి సర్పంచి మోహన్‌రావు పాల్గొన్నారు.

కడుపు 'కోత'..!



తగ్గిపోతున్న సాధారణ ప్రసవాలు
ప్రయివేటులో 62 శాతానికిపైగా గర్భిణులకు సిజేరియన్లే
వ్యాపారమయంగా ప్రసవాల ప్రక్రియ
తణుకు వంటి పట్టణాల్లో ఒక్కో ప్రసవానికి రూ.లక్ష వరకూ వసూలు
సిజేరియన్లతో చిన్న వయస్సులో అనేక అనారోగ్య సమస్యలు
సాధారణ ప్రసవాలపై దృష్టి సారించని ప్రభుత్వాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మనిషి పుట్టుకను కూడా ప్రయివేటు ఆసుపత్రులు వ్యాపారమయంగా మార్చేశాయి. సాధారణ ప్రసవాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల తీరే దీనికి నిదర్శనం. ధనార్జనే లక్ష్యంగా పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు ఇష్టానుసారంగా సిజేరియన్లు (ఆపరేషన్లు) చేస్తున్న దుస్థితి నెలకొంది. సాధారణ ప్రసవాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆపరేషన్లకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. బిడ్డ అడ్డం తిరగడం వంటి అత్యవసర సమయాల్లో చేయాల్సిన ఆపరేషన్లను అలవోకగా చేస్తూ సొమ్ము దండుకుంటున్నారు. ఆపరేషన్లతో ప్రసవాలు చేసుకుంటున్న గర్భిణులు తర్వాత క్రమంలో అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. గడిచిన పది నెలల్లో ఏలూరు జిల్లాలో 17,327 ప్రసవాలు జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీనిలో ప్రయివేటు ఆసుపత్రుల్లో 8,863 ప్రసవాలు జరగ్గా వీటిలో 6,046 సిజేరియన్ (ఆపరేషన్) ప్రసవాలు జరిగాయి. దాదాపు 62 శాతం గర్భిణులకు ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు చేసిన పరిస్థితి నెలకొంది. విభజిత పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. సిజేరియన్ ప్రసవాలు ప్రభుత్వాసుపత్రుల్లో తక్కువగా ఉండగా ప్రయివేటు ఆసుపత్రుల్లో మాత్రం పెద్దసంఖ్యలో చేస్తున్నట్లు లెక్కలు చెప్పకనే చెబుతున్నాయి. అమ్మ కడుపును అడ్డంగా కోసేస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి.

వ్యాపారమయంగా ప్రసవాల ప్రక్రియ

ఒకప్పుడు అత్యధిక ప్రసవాలు సాధారణ పద్ధతిలోనే జరిగేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గర్భం దాలిస్తే ఆపరేషన్ తప్పనిసరి అన్నట్లు పరిస్థితి మార్చేశారు. సాధారణ ప్రసవాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రయివేటు ఆసుత్రుల్లో ఆపరేషన్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసవాల ప్రక్రియను ప్రయివేటు ఆసుపత్రులు వ్యాపార ధోరణితో చూస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. గర్భం దాల్చిన నాటి నుంచి గర్భిణి కుటుంబ సభ్యుల నుంచి పలు ప్రయివేటు ఆసుపత్రులు ఇబ్బడిముబ్బడిగా దోచేస్తున్న పరిస్థితి నెలకొంది. గర్భం దాల్చిన రెండో నెల నుంచి స్కానింగ్‌లు, అవసరం లేకపోయినా అనేక టెస్టుల పేరుతో రూ.వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇవికాకుండా ఆపరేషన్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. తణుకు, భీమవరం వంటి పట్టణాల్లో ఒక్కో ప్రసవానికి దాదాపు రూ.లక్ష వరకూ ఖర్చవుతుండగా ఏలూరు, తాడేపల్లిగూడెం వంటి పలు పట్టణాల్లో రూ.50 వేల వరకూ ఖర్చవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇంట్లో ఆడ పిల్ల గర్భం దాలిస్తే ఖర్చుల కోసం భయపడే పరిస్థితులు తల్లిదండ్రుల్లో నెలకొన్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా బెడ్స్ లేకపోవడం, వసతులు తక్కువగా ఉండటం వంటి అనేక కారణాలు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లేలా చేస్తున్నాయి. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యేసరికి రూ.లక్ష 50 వేల వరకూ ఖర్చు పెట్టాల్సిన భయంకరమైన పరిస్థితులు సాగుతున్నాయి. అవసరమైతే తప్ప సిజేరియన్లు చేయకుండా కట్టడి చేయడంలో ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు ఆసుపత్రులు ఇష్టానుసారం రెచ్చిపోతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే గర్భిణులకు కడుపు కోత తప్పుతుందని చెప్పొచ్చు. లేకపోతే ముందుముందు నూటికి నూరుశాతం సిజేరియన్ ప్రసవాలు చేసే ప్రమాదం ఏర్పడనుంది. ఆపరేషన్లతో ప్రసవాలు జరగడంతో చిన్న వయస్సులోనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు మహిళలు చెబుతున్నారు.

రెవెన్యూ డివిజన్‌గా తాడేపల్లిగూడెం

పశ్చిమ గూటికి గణపవరం మండలం
ఏలూరు మండలం అర్బన్, రూరల్‌గా విభజన
రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాడేపల్లిగూడెం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలుపుతూ మంత్రిమండలి నిర్ణయించింది. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. పట్టణాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించే క్రమంలో ఏలూరును అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఏలూరు రూరల్‌లో ఉన్న దాదాపు 16 గ్రామాలు రూరల్ మండలంగా, ఏలూరు పట్టణం అర్బన్ మండలంగా ఏర్పడనుంది. అదేవిధంగా తాడేపల్లిగూడెం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోపాటు పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. గతంలోనే ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలపనున్నట్లు సిఎం జగన్ ప్రకటించగా నోటిఫికేషన్ సైతం విడుదల చేసి అభ్యంతరాలను ప్రభుత్వం కోరింది. అయితే ఇప్పటి వరకూ గెజిట్ విడుదల కాకపోవడంతో అనుమానాలు, విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తాడేపల్లిగూడెం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని జిల్లాల విభజన ప్రక్రియ నుంచి చర్చ జరుగుతున్నప్పటికీ ముందుకు సాగలేదు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ కొట్టు సత్యనారాయణ ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉండటంతో రెవెన్యూ డివిజన్ ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం వేయడంతో డివిజన్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడనున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలను కలిపి ఒక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు.





మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

దశరత్నంగా భూ పంపిణీ చేర్చాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నవరత్నాల్లో దశరత్నం పథకం కింద భూ పంపిణీ చేర్చి రాష్ట్రంలో ఎనిమిదో విడత భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రామన్నపాలెంలో జిల్లా సదస్సు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అసైన్డ్, సీలింగ్, 1/70, 9/77 చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు, జిఒలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు వేల ఎకరాల ఎర్ర కాలువ మిగులు భూములు, దోసపాడు అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలన్నారు. పాత చింతలపూడి పరిధిలో ఉన్న 30వేల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పట్ల వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అసైన్డ్, సీలింగ్ ప్రభుత్వ భూములు పేదల పంచాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంటే, ఉద్యమ నేతలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 250 కేంద్రాల్లో భూపోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ పోరాటాల్లో భాగంగానే ఏలూరు జిల్లాలో ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూముల పోరాటం, దోసపాడు భూ పోరాటం బుట్టాయగూడెం మండలంలో ఇళ్ల స్థలాల పోరాటం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూ బ్యాంకుల పేరుతో దళితుల, పేదల భూములను లాక్కొని భూస్వాములకు కట్టబెడుతున్నాయన్నారు. పేదలకు భూ పంపిణీ చేయకపోగా తరతరాలుగా అనుభవిస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్, జరాయితీ, సీలింగ్, ప్రభుత్వ భూములను పెత్తందారులకు ఇస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పేరుతో పేదలకు అనుకూలంగా ఉన్న సీలింగ్, అసైన్డ్, 1/77, 9/77 చట్టాలు, అటవీ హక్కుల చట్టం, 2013 భూ సేకరణ చట్టాలను తుంగలో తొక్కి నష్టపరిహారం చెల్లించకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. ఎక్కడైనా పేదలు భూమి కోసం తిరగబడితే అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మిగులు భూముల కోసం ఆరేళ్లుగా పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. పేదల హక్కులకు భంగం కలగకుండా ఎల్‌టిఆర్ భూముల సాగుకు పట్టాలివ్వాలని కోరుతున్నా చెవిటివాడిముందు శంఖం ఊదినట్లు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తరతరాలుగా ఆదివాసీలు పోడు నరికి సాగు చేస్తున్న అటవీ భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా రకరకాల సాకులు చెబుతూ దాట వేస్తున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసితులను గోదావరిలో ముంచి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి ఇవ్వడంలో పునరవాస కాలనీల నిర్మాణంలో, జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి టి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్ నారాయణ మాట్లాడుతూ కరోనాకాలంలో పేదలను ఆర్థికంగా ఆదుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఈ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం పేద రైతులు వ్యవసాయ కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నప్పటికీ భూమికి భూమి పరిహారం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ జిల్లాలో రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు ఐక్యంగా భూమి కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. భూమి కోసం పేదలు రోడ్డెక్కి పోరాడుతుంటే ప్రభుత్వాలు బెదిరించడం దారుణమన్నారు. పేదలు చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాబోయే కాలంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సదస్సులో సంఘం జిల్లా నాయకులు తుమ్మల సత్యనారాయణ, అందుగుల ఫ్రాన్సిస్, వై.సీత, డి.సత్యనారాయణ నాయకత్వం వహించారు. సుమారు 80 మంది నేతలు పాల్గొన్నారు.



సంతాప సభకు హాజరైన ప్రముఖులు

వట్టి వసంత్‌కుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రగతికి బాటలు వేసిన మాజీమంత్రి వట్టి వసంత్‌కుమార్ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల విభజనను అసెంబ్లీ సాక్షిగా వ్యతిరేకించిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారన్నారు. వసంత్‌కుమార్ సంతాపసభ పూళ్ల పరిధిలోని మల్కీ మహ్మద్‌పురంలోని ఆయన నివాసంలో బుధవారం నిర్వహించారు. ఈ సభకు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత కొద్దిసేపు మౌనం పాటించారు. వసంత్‌కుమార్‌తో తమకు ఉన్న అనుబంధం, ఆయన సేవలు, స్నేహానికి ఇచ్చే గౌరవం, రాజకీయ నేపథ్యంలో పూర్వకాలం నుంచి ఆయన కుటుంబ సభ్యులు అందించిన సేవలు, వారసత్వంగా వాటిని వసంత్‌కుమార్ కొనసాగించిన ఇతర అంశాలను వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీ కెవిపి.రామచంద్రరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు రఘువీరారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఈలి నాని, గన్ని వీరాంజనేయులు, కొండ్రెడ్డి విశ్వనాథం, శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు, గ్రంధి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఆయన సహచరులు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వసంతరావు

ధాన్యం సొమ్ము చెల్లించాలి

చింతలపూడి: ధాన్యం అమ్మి 40 రోజులు కావస్తున్నా, ఇప్పటివరకు రైతులకు డబ్బులు రాలేదని, తక్షణమే ధాన్యం డబ్బులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని సమ్మెటవారిగూడెంలో రైతు రావెళ్ల హనుమంతరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి 21 రోజులకే డబ్బులు చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ 40 రోజులైనా డబ్బులు విడుదల చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. తక్షణం ధాన్యం డబ్బులు విడుదల చేయాలన్నారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.కాలేశా, దంతా కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ఇటీవల పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కౌలు రైతుల ఊసే లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం మార్చి 13వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయకుల లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో కౌలు రైతులు ధాన్యం విక్రయించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలనకు

నగరంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున సిఎం జగన్ మంజూరు చేసిన నిధులు, ఎంపీ ల్యాండ్ నిధులతో పూర్తిచేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ భవనాలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణతో కలిసి బుధవారం నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో రూ.146.81 లక్షలతో 44 పనుల్లో లబ్బీపేట, ఎంఆర్‌సి కాలనీ, పంపుల చెరువు సెంటర్, తోటకూర దొడ్లు, యాదవ నగర్, రజకుల పేట, కొత్తపేట, చోడిమిల్లి, పోస్టల్ కాలనీల్లో పూర్తిచేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఎంపీ నిధులు రూ.91.50 లక్షల వ్యయంతో నగరంలోని 17, 43, 25, 4, 24 డివిజన్లలో అభివృద్ధి పనుల్లో పూర్తయిన మల్టీపర్పస్ భవనాలు, గాంధీ జ్ఞాన మందిర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీసీ రోడ్లు అక్కడక్కడ ఫినిషింగ్ సరిగా లేదని వాటిని సరిచేయాలని, రోడ్లపై ఉన్న వాటర్ పైపులు తొలగించి నీరు వృథాకాకుండ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీలో చెత్తతొలగింపు సరిగా లేదని సరిచేసి క్లీనింగ్ చేసిన అనంతరం ఫొటోలు తీసి సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. వార్డు సచివాలయంలో ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ల పర్యవేక్షణ లేదని, వారికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో పారిశుధ్య మెరుగుకు ఏర్పాటు చేసిన టీమ్ పారిశుధ్య మెరుగులో విజిబుల్ శానిటేషన్ కనబడుటలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మేదర వీధిలోని 43వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్పందన అర్జీలు, నవరత్నాలు, జగనన్న కాలనీ గ్రౌండ్, సిబ్బంది హాజరు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటన గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎఆర్‌డిజికె నగర బాలికోన్నత పాఠశాలలోని లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, దానికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని, పాఠశాల ఆవరణలో కాంక్రీట్ వేసి బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావుని కలెక్టర్ ఆదేశించారు. నగరంలో ఉన్న ప్రయివేటు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన మురుగునీరు, చెత్త తొలగింపునకు యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఎంఇ భాస్కర్‌రావు ఎంహెచ్ఒ ఆర్.మాలతి, పబ్లిక్ హెల్త్ డిఇ ఫణిభూషణ్, మున్సిపల్ ఎఇ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి

సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



పొగాకు పంటను పరిశీలిస్తున్న శేషుమాధవ్

రైతులు నాణ్యమైన పొగాకును పండించాలని సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ సూచించారు. బుధవారం సిటిఆర్ఐలో జరిగిన కిసాన్ మేళ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొగాకు పంటలో క్రిమి సంహారక మందులు వాడకం తగ్గించి ప్రకృతిసిద్ధమైన ఎరువులు వాడాలని సూచించారు. అప్పుడే నాణ్యమైన పొగాకు ఉత్పత్తి అవుతుందని, దానితో దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. నాణ్యమైన పొగాకును పండించడం వల్ల రైతుకు లాభాలు చేకూరతాయన్నారు. పొగాకులో అంతర్‌పంటలుగా పసుపు, బంతిపూలు సాగుకు రైతులు ఆసక్తి చూపాలన్నారు. అందుకు అనుగుణంగా సిటిఆర్ఐలో షెడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సిటిఆర్ఐ ప్రవేశపెట్టిన ఎఫ్‌సిజి-11 పొగాకు పంటను పరిశీలించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల నుంచి 500 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డ్ రీజినల్ మేనేజర్ ప్రసాద్‌బాబు, శాస్త్రవేత్తలు కస్తూరి, సరళ, సిటిఆర్ఐ హెడ్ సుబ్బయ్య, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, అసిస్టెంట్ ఫామ్ మేనేజర్ ఫామ్ మేనేజర్ జయకృష్ణ, రమేష్, ప్రభు, ఉత్తమ రైతులు గద్దె లక్ష్మణరావు, తెల్లం వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పన్ను కట్టకుంటే

ఆస్తుల జప్తుకు వెనుకాడబోం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే ఆస్తులను జప్తుచేసేందుకు సైతం వెనుకాడబోమని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కమిషనర్ భవానీప్రసాద్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పన్ను ఎగవేతదారుల జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి, కమిషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పన్ను బకాయిదారులందరికీ నోటీసులు జారీ చేశామన్నారు. రూ50 వేలకు పైబడిన మొండి బకాయిదారుల జాబితాను ప్రకటించారు. పట్టణంలో ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యా, వ్యాపార సంస్థల ప్రతినిధులు సుమారు వందమంది వరకూ రూ.రెండు కోట్లకు పైగా పన్నులు కట్టాల్సి ఉందని తెలిపారు. ఇతరులు మొత్తం రూ.9 కోట్లు మున్సిపాలిటీకి బకాయి ఉన్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో ఏడు వేల కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో పట్టణంలో 1600 అక్రమ కుళాయి కనెక్షన్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ నోటీసులు జారీ చేసి పన్ను చెల్లించాలని కోరామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి, పారిశుధ్య నిర్వహణకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ప్రధానమని తెలిపారు. పన్ను సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మొండిబకాయిదారులపై చేపట్టే చర్యల్లో భాగంగా వారి ఆస్తులను జప్తు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బత్తిన నాగలక్ష్మి

పాఠశాలల్లో ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లాలోని హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సుల్లో వచ్చిన వినతులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండలస్థాయి అధికారులు, పిహెచ్‌సి వైద్యులు, పోలీసులతో వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సుల్లో వచ్చిన వినతులను మండలాల వారీగా సమీక్షించారు. వీటిలో బయటి వ్యక్తులు పాఠశాలల్లో ప్రవేశిస్తున్నారని, స్కూళ్లలో చదువుతున్న పెద్ద పిల్లలు చిన్న పిల్లలను ఇబ్బందులు పెడుతున్నట్లు, రాత్రి సమయంలో కొంతమంది పాఠశాలలోకి ప్రవేశించి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. స్కూలు ప్రహరీ గోడలపై గ్రామ యువకులు కూర్చుంటున్నట్లు తదితర ఫిర్యాదులు వచ్చాయని వీటికి కారణమైన విద్యార్థులను గుర్తించి పోలీస్, స్కూలు ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని, అవసరమైతే వారి తల్లిదండ్రులను స్టేషన్‌కి రప్పించి కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలిపారు. ఫిర్యాదుల బాక్సుల పర్యవేక్షణకు స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ, ఎంపిడిఒ టీములుగా ఫిర్యాదులపై చర్చించుకుని పరిష్కరించాలని అవసరమైతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. విలేజ్ క్లీనిక్‌కు సంబంధించిన భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలని, ఇప్పటి వరకూ కొన్ని మండలాల్లో స్టేజ్ కన్వర్షన్లు కూడా చేయలేదని వెంటనే స్టేజ్ కన్వర్షన్ చేసి పనులు ప్రారంభించాలన్నారు. పేదలకు ఇంటివద్దే వైద్య సేవలందించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయడానికి డాక్టర్లు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ముఖ ఆధారిత గుర్తింపు హాజరు నూరుశాతం ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పిహెచ్ సిలకు సంబంధించిన డాక్టర్లతో హాజరు శాతాన్ని సమీక్ష చేశారు. పిహెచ్‌సిలలో తప్పనిసరిగా సెలవు రిజిస్టరు అమలు చేయాలని, తనిఖీకి వచ్చినప్పుడు రిజిస్టర్ చూపించాలన్నారు. ఉగాది నాటికి జిల్లాలో 26,134 ఇళ్లు పూర్తి చేయాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను, చిన్నారులను, గర్భిణులను గుర్తించి వారికి పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించే చర్యలు చేపట్టాలన్నారు. దీనికి సంబంధించి జిల్లాస్థాయి కమిటీ వలే గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి సచివాలయాల పరిధిలో సర్వే చేపట్టి రక్తహీనత ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి వారి పరిరక్షణకు నేరుగా రోజువారీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో ఆర్‌బికె, ఎఎంసియు, బిఎంసియు, కమ్యూనిటీ శానిటేషన్, హౌసింగ్ లే అవుట్స్, గ్రౌండింగ్ హౌసింగ్ లోన్స్, హేబిటేషన్ సర్వే(సేవామిత్ర) స్వచ్ఛ సర్వేక్షణ్, గ్రీవెన్స్ ప్రోగ్రెస్, ఇండస్ట్రీస్ సిఎస్ఆర్ ప్రపోజల్స్, నవరత్నాలు పథకాలు, నాడు-నేడు ఫేజ్-2, తదితర అంశాలపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ రవికుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, పంచాయితీరాజ్ ఎస్ఇ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కొల్లూరి మార్కు సేవలు మరువలేనివి


కొల్లూరి మార్కు (ఫైల్)

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విశ్రాంత ఉపాధ్యాయులు, కనసానపల్లి సిఎస్ఐ చర్చి కౌన్సిల్ సభ్యులు కొల్లూరి మార్కు(67) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన ఆగిరిపల్లి మండలంలో గత 30 ఏళ్లకు పైగా ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పలువురి మన్ననలు పొందారు. కాలంలో కనసానపల్లి సిఎస్ఐ చర్చి అభివృద్ధికి ఎంతగానో శ్రమించారు. కొల్లూరి మార్కు మృతదేహాన్ని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాణి

అంగన్‌వాడీలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు


అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంపిడిఒ జి.రాణి సూచించారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. అనంతరం వలసపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలు అమలు చేయడంలో అలసత్వం వహించొద్దని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ జయబాబు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బుట్టాయగూడెం ఎస్ఐ జయబాబు అన్నారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో యాంటీ డ్రగ్స్‌కు సంబంధించి ప్లెక్సీ ఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి ఉద్యోగాలను సాధించడానికి యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

హెచ్ఐవి రోగులకు హెపటైటిస్-బి


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

హెచ్ఐవి రోగులకు ఉచితంగ హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఏరియా ఆసుపత్రి ఎఆర్‌టిసి విభాగంలో అందుబాటులో ఉందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల తెలిపారు. ఆసుపత్రిలో ఉచిత హెపటైటిస్-బి వ్యాక్సిన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబీకమల మాట్లాడుతూ హెచ్ఐవి రోగులకు రూ.మూడు వేల విలువైన హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. సుమారు 2500 మందికి ఈ వ్యాక్సిన్ అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌టిసి విభాగం వైద్యులు డాక్టర్ వి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

రబీ సీజన్‌లో పలు పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ట్రెయినీ కలెక్టర్ అపూర్వ అన్నారు. మండలంలోని చక్కపల్లి గ్రామంలో ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులందరూ ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.


ఇ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

నేరాలు - ఘోరాలు

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ


ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరంలో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి విద్యుత్ వైర్లు అపహరించుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగడవరానికి చెందిన రైతులు ఎం.రామ్మోహన్‌రెడ్డి, కంభంపాటి శివన్నారాయణ, శ్రీను, చీమట వెంకటేశ్వరరావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయా రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ బి.వెంకన్న మాట్లాడుతూ కాపర్ వైరు అపహరణ విషయం రైతుల తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ముగిసిన న్యూమరికల్ మెథడ్స్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో న్యూమరికల్ మెథడ్స్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల కార్యశాల బుధవారంతో ముగిసింది. ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అభిరుచి, ఆసక్తి పెంపొందించుకుని గణిత శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వినూత్నమైన కోణంలో గణిత శాస్త్ర విభాగం ఏర్పాటు చేసిన ఈ కార్యశాల ద్వారా విద్యార్థులకు ప్రయోజనం కలిగిందన్నారు. ఈ సందర్భంగా విభాగ అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ముఖ్య వక్తగా విచ్చేసిన టి.శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో గల అంతర్భావం, మరిన్ని కొత్త విషయాలను బోధించాలని ఆలోచన కలిగించిందని, భవిష్యత్తులో గణిత శాస్త్రంలో నైపుణ్యం సంపాదించడానికి కావాల్సిన మెలకువలను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేయడం ఎంతో సంతోషకరమన్నారు. గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.బాబురావు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో సాధన చేయడం ద్వారా మేధోసంపత్తి పెంపొందించుకోవడమే కాకుండా శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించే అవకాశం అధికంగా కలుగుతుందన్నారు. ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు ముఖ్యఅతిథిగా విచ్చేసిన టి.శివకృష్ణను సన్మానించి అభినందించారు.


శివకృష్ణను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు


బస్వావరప్పాడులో ఏర్పాటు చేసిన బోరు

బస్వావరప్పాడులో నూతన బోరు ఏర్పాటు

ప్రజాశక్తి - ముసునూరు

వేసవికాలంలో మంచినీటి కొరత లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో నూతన బోరు వేయించనున్నట్లు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని లోపూడి గ్రామ పంచాయతీ శివారు బస్వావరప్పాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా నూతన బోరు మోటారు ఏర్పాటు చేసి తాగు నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, సర్పంచి పేరం కృష్ణ ,ఉపసర్పంచి మువ్వా బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు

ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదో తేదీ నిర్వహించాల్సిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక తదుపరి తేదీని తర్వాత తెలియజేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు, రేపు సుకన్య సమృద్ధి యోజన ఖాతాల డ్రైవ్

ప్రజాశక్తి - ఏలూరు

భారత తపాలా శాఖవారు అమృత్ పెక్స్-2023 కార్యక్రమంలో భాగంగా ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో ప్రత్యేక సుకన్య సమృద్ధి యోజన ఖాతాల డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహమ్మద్ ఆసీఫ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదేళ్ల లోపు బాలికలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలని తెలిపారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఉన్నత విద్యకు ఉన్న మొత్తంలో 50 శాతం వరకు లోనుగా పొందువచ్చన్నారు. కనీసం రూ.250తో ఈ ఖాతాను ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 7.6 శాతం వడ్డీ రేటుతో అన్ని పోస్టాఫీసుల్లో ఈ ఖాతా లభిస్తుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలో ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో జరిగే ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొని ఇంకా ఈ ఖాతా పొందని పదేళ్ల లోపు బాలికల తల్లిదండ్రులు సుకన్య ఖాతాను ప్రారంభించుకోవాలని కోరారు.

న్యాయంపల్లిలో 'పొలంబడి'

ప్రజాశక్తి - పెదవేగి

నేలల స్వభావాన్ని బట్టి కూడా పంటల దిగుబడులు ఉంటాయని పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక అన్నారు. మండలంలోని న్యాయంపల్లి గ్రామంలో ఎఒ ప్రియాంక బుధవారం మొక్కజొన్న పంట పొలాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంట అనువైన నేలల్లో బలంగా పెరిగితే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. కొన్ని రకాల చౌడు భూముల్లో మొక్కజొన్న పంటకు ఎదుగుదల లోపంతో పాటు జింక్, పొటాషియం, నత్రజని శాతం తగ్గి మొక్క దశలోనే తెగుళ్లు బారిన పడుతుందన్నారు. ఇటువంటి నేలల్లో మొక్కజొన్న సాగు చేసే రైతులు నేల స్వభావాలను భూ పరీక్షల ద్వారా తెలుసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట పొత్తు ఏర్పడే దశలో మిత్ర పురుగులు, శత్రు పురుగులు ఆసిస్తాయని చెప్పారు. పురుగుల సంఖ్యను అంచనా వేసుకుని పురుగు నివారణకు అవసరమైతే పురుగుమందును పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్న కర్రల ఆకుల మాటున మొవ్వుల్లో దాగి ఉన్న పురుగులను గుర్తించి రైతులతో తీయించారు. మొక్కజొన్న పంటలో పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు మొఖానికి మాస్క్‌లు, చేతులకు గ్లౌజ్‌లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

'దళిత, గిరిజనులను విస్మరించిన వైసిపి'

ప్రజాశక్తి - చింతలపూడి

దళిత, గిరిజనుల సంక్షేమాన్ని వైసిపి విస్మరించిందని టిడిపి నియోజకవర్గ నాయకులు గుడిపూడి రవి, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా విమర్శించారు. ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వాలు కొనసాగించిన అంబేద్కర్ విదేశీ విద్యను నిర్వీర్యం చేసి జగనన్న దూర విద్య తీసుకొచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న దళిత, గిరిజన వ్యతిరేక విధానాలను ఖండిస్తూ పట్టణంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోండ్రు దేవా మాట్లాడుతూ జగనన్న దూర విద్య పథకంలో కూడా వైసిపి ప్రభుత్వం దళిత, గిరిజన విద్యార్థులకు సముచిత న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం ఇదే పంథాను అవలంభిస్తే రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి దళిత, గిరిజనులు తగిన గుణపాఠం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు నందిపాము నాగేశ్వరరావు, ఎస్‌సి సెల్ టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం, పార్లమెంటు రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, టౌన్ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ఐటిడిపి మండల అధ్యక్షులు బాణావతు ఉమాశంకర్, తాటి అప్పారావు, కంభం రమేష్, సొంగ ఏసుపాదం, కంచర్ల అబ్రహం, దార వీరేంద్ర, పల్లె పరదేశి, మారుముడి థామస్, మద్దా ఆనంద్, గడిదేసి యేసు, ఉలాస సుబ్బారావు, పల్లె మున్న, కనిపెడ రవి, జానేసు, వెంకట్, తొమ్మండ్రు వెంకట్రావు, గద్దె శివ, మారుముడి రాజేష్, చుండ్రు చంద్రరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా జిల్లా స్థాయిలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే క్రమంలో శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్, డిగ్రీ, పీజీ(కామర్స్ బ్యాకప్) కలిగి 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మూడు నెలల శిక్షణ కోసం పదో తరగతి, ఐటిఐ, డిప్లమో చేసిన 18 నుంచి 30 మధ్య వయసున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నాన్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమంగా నిర్వహిస్తున్న దీనికి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా కాలంలో స్టైఫండ్ ఇస్తారన్నారు. శిక్షణ కాలంలో దరఖాస్తుదారులకు అదనంగా అడ్వాన్స్ టెక్నాలజీపై శిక్షణ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమం పూర్తి చేసుకున్న దరఖాస్తుదారులకు ప్రముఖ కంపెనీల్లో, పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు నిర్వాహకులు సహకరిస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు https://tinyurl.com/skillhub06కు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సులు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. వివరాలకు 9642387539, 8978524022తో సంప్రదించాలని తెలిపారు.

నా భర్తను బతికించరూ..!

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త ప్రాణాలు కాపాడాలని స్థానిక తంగెళ్లమూడిలోని కబాడీగూడేనికి చెందిన కాశి వాణి సిఎం జగన్‌కు లేఖ రాశారు. తన భర్త రెండున్నర సంవత్సరాలుగా లివర్ సంబంధిత వ్యాధితో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో దీర్ఘకాలంగా చికిత్స పొందుతున్నారని, అక్కడి వారు హైదరాబాద్‌కు రిఫర్ చేశారని, అయితే ఎఐజి ఆసుపత్రి వారు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని, దీనికి రూ.30 లక్షల ఖర్చవుతుందని చెప్పారని ఆమె లేఖలో తెలిపింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆళ్ల నాని దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారని, తమది నిరుపేద కుటుంబమని, మిగిలిన రూ.20 లక్షలు తాము కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు. సిఎం జగన్ స్పందించి ఆదుకోవాలని కోరారు.

వైసిపి హయాంలోనే 'విదేశీ విద్యా దీవెన' నిర్వీర్యం : టిడిపి

ప్రజాశక్తి - మండవల్లి

ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ, కాపు సామాజిక తరగతుల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే విధంగా విదేశీ విద్యా పథకంలో అవకాశం కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసగిస్తోందని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పి.జోసఫ్ తంబి విమర్శించారు. మండల కేంద్రం మండవల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించే విధంగా గత ప్రభుత్వాలు విదేశీ విద్య పథకాన్ని ప్రారంభించాయన్నారు. 2013లో ప్రారంభమైన ఈ పథకం నిర్విఘ్నంగా కొనసాగుతూ వచ్చిందని, 2014 నుండి 2019 సంవత్సరాల మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ, కాపు సామాజిక తరగతులకు చెందిన సుమారు 4923 మంది విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ.10 లక్షలు చొప్పున రూ.364.98 కోట్లు చెల్లించామని తెలిపారు. తక్షణం విదేశీ విద్య పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని, దీనికి నిబంధనలు సడలించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ జనార్దన్‌రావుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తలారి రాజేష్, గుడివాడ మురళీకృష్ణ, శ్రీను, గోపిరాజు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం:సిఎం జగన్ నిరుపేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేస్తున్నారని టిడిపి బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండపల్లి రవి విమర్శించారు. పార్టీ అదేశాల మేరకు పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేయడాన్ని నిరసిస్తూ టిడిపి బిసి సెల్ ఆధ్వర్యంలో టి.నరసాపురం ప్రధానసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంపన్నవర్గాలతో సమానంగా బడుగుబలహీనవర్గాలు 4923 మందికి రూ.364 కోట్లతో విదేశీ విద్యను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, బిసి నాయకులు పాపాచార్యుల వీరేశలింగం, మండల ఉపాధ్యక్షులు సిద్దా శ్రీను, నాయకులు పెద్దిన సత్యనారాయణ, కొల్లి మురళీ, గంటా సతీష్, నరదల రామకృష్ణ, శీలం రామారావు, కొల్లి రమేష్, కాసనేని మాధవరావు, పెద్దిన శేఖర్, కాసనేని వెంకట్రావు, పుట్టాల సతీష్, మూరుమూళ్ల పుణ్యేశ్వరరావు, గుండె రవి పాల్గొన్నారు.


మండవల్లిలో టిడిపి నేతల నిరసన

కైకలూరు:విదేశీ విద్యా దీవెన అమలులో వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎస్‌సి నాయకులు వాసుపల్లి సతీష్ విమర్శించారు. టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ విదేశీ విద్యా దీవెన పథకం కింద కేవలం 213 మందికే అందించడం ఆందోళనకరమన్నారు. వైసిపి పాలనలో దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ మేరకు బుధవారం తాలూఖా సెంటర్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, ఎస్‌సి సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈదా వెంకటస్వామి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో పురాతన బావి కనుమరుగు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని కానుకొల్లు గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ గ్రామం అంటేనే గుర్తుకు వచ్చేవి పురాతన భావి, రాజుల కాలం నాటి కోట. ఈ రెండూ తెలియని వారే ఉండరు. కోటకు సంబంధించిన ఆస్తులు క్రమేపి ఆక్రమణకు గురవుతుండగా ప్రస్తుతం చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులతో పురాతన భావి కూడా కనుమరుగు కానుందనే వదంతులతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కానుకొల్లు గ్రామ ఆరంభంలో ఈ బావి ఉంటుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రాజుల కాలం నాటి కోట ఉంది. ఈ కోటను సందర్శించేందుకు వచ్చినవారు పురాతన బావిలో నీటిని తాగి దాహార్తిని తీర్చుకునేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే బ్రిటిష్ కాలంలో తాగునీటి అవసరాల కోసం ఈ బావిని తవ్వారని పెద్దలు చెబుతున్నారు. సుమారు వంద గ్రామాల ప్రజలు ఈ బావి నీటిని తాగేవారని తెలిపారు. కాలినడక దారి కూడా లేనప్పటి రోజుల్లో ముదినేపల్లి, కైకలూరు వరకూ ఉన్న పోల్రాజు కాలవపై ప్రజలు పడవలలో ప్రయాణించి కైకలూరు, ముదినేపల్లి గ్రామాల్లో నిర్వహించే సంతలో కూరగాయలు కొనుగోలు చేసివచ్చి కానుకొల్లు బావి వద్ద దాహార్తిని తీర్చుకుని అప్పట్లో ఉన్న సామగ్రితో నీటిని తీసుకెళ్లిన చరిత్ర ఈ బావికి ఉందని గ్రామస్తులు వివరిస్తున్నారు. అంతేకాకుండా స్వాతంత్ర్య సమరయోధుడు గాంధీ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఆ బావిలో నీటిని తాగేవారని చెబుతున్నారు. అలాంటి ఈ బావి ఇకనుండి కనపడదు అంటేనే బాధ కలుగుతుందని గ్రామస్తులు అంటున్నారు.


పురాతన బావి

గ్రామంలో సురక్షిత తాగునీటి పథకాలున్నప్పటికీ గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నేటికీ ఈ బావిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 1963లో ఈ బావి శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి అప్పటి సర్పంచి కాకర్ల నాగేశ్వరరావు బావికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా అప్పటి కలెక్టర్ ఆదేశాలతో బావిని ఆధారం చేసుకుని ఇనుప కట్టడాలతో సురక్షిత తాగునీటి పథకాన్ని అప్పట్లోనే నిర్మించి గ్రామానికి తాగునీరు అందించిన దాఖలాలు కూడా ఉన్నాయని గ్రామస్తులు వివరిస్తున్నారు. కానుకొల్లుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో బావులు అనేకం ఉన్నప్పటికీ రొయ్యలు సాగు వల్ల, కైకలూరు మండవల్లి ప్రాంతాలు సముద్ర తీరానికి దగ్గరగా ఉండడం వల్ల భూగర్భ జలాలు కలుషితమై బావులు, బోర్లలోని నీరు ఉప్పుగా మారిపోయాయి. తాగునీరు అందడం లేదని పలువురు చెబుతున్నారు. కానీ వందేళ్ల క్రితం తవ్విన బావిసైతం నీటిసారం కోల్పోకుండా నేటి ఆధునిక ఫిల్టర్లు కూడా పనిచేయలేనంత విధంగా ఈ భావి నీరు కలుషితం కాకుండా, స్వచ్ఛంగా ఉంటాయని ప్రజలు చెబుతున్నారు. ఈ బావి నీరు తాగేందుకు బాగుంటాయని, రోగాలు కూడా దరిచేరవని గ్రామస్తులు వివరిస్తున్నారు.

చరిత్రకు ఆధారంగా నిలిచిన ఈ బావిని రోడ్డు విస్తరణ పనుల్లో కనుమరుగు కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నర్సింగ్ విద్యార్థినుల ఫేర్‌వెల్

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరులోని బిఆర్ అండ్ డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల మూడో సంవత్సరం సందర్భంగా జూనియర్స్ ఫేర్‌వెల్ పార్టీ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ ఈ కళాశాలలో నర్సింగ్ కోర్సుకు సంబంధించినవే కాకుండా ఎన్నో కార్యక్రమాలు చేయడం వల్ల సమాజానికి కావాల్సిన విషయాలు అన్ని విద్యార్థులు తెలుసుకున్నారన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన అందరూ కళాశాలలో బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిగమించాలన్నారు. 2019-2022 సంవత్సరం బ్యాచ్ అందరూ హైదరాబాద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉద్యోగం చేసేందుకు వెళ్లడం ఆనందదాయకమన్నారు.